
సాక్షి కర్నూలు

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రుద్రగుండం, బ్రహ్మగుండం కోనేరుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం నిత్యకళావేదికపై విజయవాడ శారదా నృత్య కళాపీఠం కళాకారులు శైవ గీతాలకు నృత్యం చేసి అలరించారు.




టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,614.16
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:46.507
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,232

రైతు కంట్లో కారం

- మిర్చి ధర పతనం
- కన్నీరు పెడుతున్న రైతన్నలు
- వేడుక చూస్తున్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 95,477 ఎకరాల్లో మిరపసాగు
- తెగుళ్లతో పతనమైన దిగుబడులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో మిరపకు రికార్డు స్థాయి ధరలు



మంత్రాలయం వద్ద కల్లాల్లో ఆరబోసిన మిరప



తామర ఆశించిన మిరప పైరు

మిరప సాగు చేయడమే ఓ సాహసం. భారీ పెట్టుబడితో కూడుకున్న ఈ పంటకు మార్కెట్లో ధర ఉంటేనే గట్టెక్కడం గగనం.అలాంటిది ఈ ఏడాది దిగుబడులు తగ్గిపోయి, ధర లేక రైతన్నలు సతమతమవుతుంటే కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. గిట్టుబాటు ధరలు కల్పించకుండా వారి నెత్తిన నష్టాల మూట మోపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మిరప రైతులు మిలమిల మెరిశారు. ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ధరలు కల్పించి ఎర్రబంగారం సాగును లాభాల బాటలో నడిపించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను పీకల్లోతు నష్టాల్లో నెట్టి మిర్చి సాగంటేనే జంకే పరిస్థితి తీసుకొచ్చింది.

మంత్రాలయం: రాష్ట్రంలో మిరప సాగులో మొదటి స్థానంలో గుంటూరు కాగా కర్నూలు జిల్లాది రెండో స్థానం. ఈ ఏడాది జిల్లాలో 95,477 వేల ఎకరాల్లో మిరప సాగైంది. తేజ (సన్న సైజు) రకాలు అత్యధికంగా ప్రకాశం, ఒంగోలు, గుంటూరు జిల్లాలో సాగు చేస్తారు. కర్నూలులో ఎక్కువగా డీలక్స్, బ్యాడిగ రకాలు పండిస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో ఎక్కువగా డీలక్స్, సింజెంటా బ్యాడిగ, తేజా రకాలు సాగు చేస్తున్నారు. పెద్దకడబూరు, మంత్రాలయం, నందవరం, చిప్పగిరి, ఆదోని, కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, సి.బెళగల్ మండలాల్లోనూ మిరప పంట వేశారు.

పట్టించుకోని కూటమి సర్కారు

కూటమి ప్రభుత్వం మిరప రైతు కంట్లో కారం కొట్టి కన్నీళ్లు పెట్టిస్తోంది. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే సగానికిపైగా ధరలు పతనం కావడంతో గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు గగ్గోలు పెడుతున్నా కూటమి సర్కారుకు చీమ కుట్టినట్లు లేదు. గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి ధరలు పూర్తిగా తగ్గిపోవడం దారుణం. మిర్చి ధర క్వింటాల్ రూ.12 వేలకు మించి పలకడం లేదు. డీలక్స్ రకాలు రూ.10–12 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇక తేజ రకం క్వింటాల్ రూ.14 వేలు, సింజెంటా బ్యాడిగ రకం రూ.13 వేల లోపు మాత్రమే. ఇది ఈనాటిదే కాదు చంద్రబాబు గత పాలనలోనూ ఇదే పరిస్థితి. ఆయన ఎప్పుడూ రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకున్న దాఖలాలు లేవు.

దిగుబడుల్లోనూ దిగులే

మిరప దిగుబడుల్లోనూ వ్యత్యాసం లేకపోలేదు. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు దారుణంగా పడిపోయాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎకరాకు 20–25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మాత్రం ఎకరాకు 10 క్వింటాళ్లకు మించని పరిస్థితి. మరికొంత మందికి ఎకరా రూ.5 క్వింటాళ్లు కూడా దాటని వైనం.ఇందుకు తామర పురుగు, జెమినీ వైరస్‌తో పాటు వాతావరణంలో మార్పు ప్రధాన కారణం. దీంతో ఈ ఏడాది నల్లి తీవ్రత ఎక్కువైంది. జిల్లాలో 30 వేల ఎకరాల్లో నల్లి ప్రభావంతో దిగుబడులు పడిపోయినట్లు అధికారుల అంచనా.

పెరిగిన పెట్టుబడులు

మిరప సాగుకు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఒక ఎకరాలో విత్తు డీలక్స్ రకానికి రూ.10 వేలు వెచ్చిస్తున్నారు. కూలీలు, సేద్యాలు, ఎరువులు, పిచికారీ మందులు తదితర వాటికి పంట ముగిసే వరకు రూ.లక్ష వరకు పెడుతున్నారు. తామర ప్రభావం లేకపోతే ఎకరాకు రూ.70–80 వేలు ఖర్చు వస్తోంది. నల్లి ప్రభావం ఉంటే ఎకరాకు రూ.1.50 లక్షల ఖర్చు రావడం ఖాయం.

దక్కని గిట్టుబాటు ధర

అసలే వైరస్ మూలంగా రైతులకు సరైనా దిగుబడులు లేకపోయాయి. కనీసం పండిన అరకొర పంటను అమ్ముకోవడానికి గిట్టుబాటు ధర లేదు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెడితే ప్రస్తుతం రూ.45–60 వేలకు మించి చేతికందడం లేదని వేలాది మంది రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎరువుల ధర బస్తాపై రూ.100–200 పెంచడంతో పెట్టుబడి భారం మరింతగా పెరిగిపోయింది. ఈ కష్ట సమయంలో తమకు అండగా నిలబడాల్సిన కూటమి సర్కారు పట్టనట్టు వ్యవహరిస్తోందని రైతులు వాపోతున్నారు.

నాడు- నేడు మిరప ధరల్లో వ్యత్యాసం ఇలా..

మిరప రకాలు	వైఎస్సార్‌సీపీ హయాంలో.. రూ.వేలల్లో		కూటమి పాలనలో రూ.వేలల్లో
	(2022-23)	(2023-24)	(2024-2025)
తేజ రకాలు	24-26 వేలు	20-21	10-13 వేలు
డీలక్స్ రకాలు	24-25	18-20	10-12
సింజెంటా బ్యాడిగ	48-53	25-30	10-13
273 రకాలు	24-25	16-18	10-11
341 రకం	23-25	15-18	10-13
డబ్బి బ్యాడిగ	88-93	30-40	14-15

జగనన్న పాలనలో రికార్డు స్థాయి ధరలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాలుగేళ్ల రైతన్నలకు రికార్డు స్థాయి ధరలు లభించాయి. గతమెన్నడూ లేని విధంగా మిరప ధరలు పలికాయి. 2022 - 2024 కాలం మిరప రైతులకు స్వర్ణ యుగమని చెప్పాలి. 2022–2023లో పలికిన ధరలు రికార్డు నెలకొల్పాయి. ఆ ఏడాది డబ్బీ బ్యాడిగ రకం కర్ణాటకలోని బ్యాడిగ మార్కెట్లో క్వింటాల్ రూ.90 వేలు ధర పలకడం నేటికీ రికార్డుగా ఉంది. అదే ఏడాది సింజెంటా బ్యాడిగ క్వింటాల్ రూ.53 వేలు ఉండగా డీలక్స్ రకాలు క్వింటాల్ రూ. 25 వేలు, తేజ రకా లు రూ.26 వేలు, 273 రకాలు రూ.24 వేలు పలికాయి. నాలుగేళ్ల పాటు మిరప రైతులు గుండెలపై చేయి వేసుకుని హాయిగా కాలం గడిపారు.

పరిస్థితి దారుణంగా ఉంది



2023లో 14 ఎకరాల్లో మిరప పంట వేయగా 500 క్వింటాళ్ల, 2024వ సంవత్సరంలో 360 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.20–25 వేలు చొప్పున విక్రయించాను. ఈ సారి 9 ఎకరాల్లో తేజ, దేవనూరు డీలక్స్ రకాలు సాగుచేశాను. ఎకరాకు రూ.3 లక్షలు చొప్పున ఖర్చు పెట్టినా దిగుబడి లేకపోయింది. ఈ ఏడాది ఎకరాకు 10–12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా ఉంది. ధరల్లేకపోవడంతో వచ్చిన దిగుబడి వేర్‌హౌస్‌లోనే ఉండిపోయింది. ప్రస్తుతం ఏసీలో ఉంచిన మిరపను క్వింటా రూ.10 వేలకు కూడా కొనుగోలు చేయడం లేదు. రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. – సురేష్‌గౌడ్, పూలచింత

సర్కారు పట్టించుకోవాలి



నేను 3.60 ఎకరాల్లో మిరప పంట వేశాను. ఈ ఏడాది రూ.2 లక్షలు వరకు పెట్టుబడి పెట్టాను. పంట కొంత ఆశాజనకంగా వచ్చినా మిరప ధర లేదు. క్వింటాల్ మిరప కేవలం రూ.10 వేలకు అడుగుతున్నారు. ఈసారి కోలుకోలేని దెబ్బ పడింది. ప్రభుత్వం రైతుల కష్టాలను పూర్తిగా వదిలేసింది. మద్దతు ధర ఇచ్చే ఆలోచన చేయడం లేదు. ఏసీ గోదాముల్లో మిరప కాయలను రూ.6–10 వేలకు మించి అడగటం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. మిరప రైతును ఆదుకునే ప్రయత్నం చేయాలి. – రాఘవరెడ్డి, బసలదొడ్డి

ఎకరాకు లక్షకు పైగా పెట్టుబడి



ఏటా నాకున్న రెండు ఎకరాల్లో దేవనూరు డీలక్స్ మిరప సాగు చేస్తున్నాను. 2023లో ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రూ.18 వేలకుపైగా మార్కెట్లో విక్రయించాను. గతేడాది మిరప వేయగా రూ.15 వేలకుపైగా అమ్మాను. ఈసారి ధరలు మరీ అన్యాయం. క్వింటాల్ రూ.12 వేలకు మించి పలకడం లేదు. తామర తెగులు మూలంగా ఈసారి ఎకరాకు లక్షకు పైగా పెట్టుబడి అయింది. దిగుబడి మాత్రం ఆ స్థాయిలో లేదు. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది. మిరప నష్టాల నుంచి గట్టెక్కే దిక్కు కనబడటం లేదు. వేలాది మంది రైతులది ఇదే పరిస్థితే. – కురువ మల్లేష్, ఎర్రకోట

న్యూస్‌రీల్

ఉల్లంఘనలపై కొరడా

- వారం రోజుల వ్యవధిలో 3 వేల కేసులు నమోదు
- రూ.6.97 లక్షల జరిమానా



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: రోడ్డు భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎస్పీగా విక్రాంత్ పాటిల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విజిబుల్ పోలీసింగ్‌పై ఫోకస్ పెంచారు. ఇందులో భాగంగా రోడ్డు భద్రత ఉల్లంఘనలు, ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రధాన దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పలు చర్యలు చేపడుతున్నారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులపై ఎంవీ ఈ–చలాన్ కేసులు 3 వేల వరకు నమోదు చేసి రూ.6.97 లక్షలు జరిమానా విధించారు. అలాగే 659 ఓపెన్ డ్రింకింగ్ కేసులు, 316 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. పట్టణ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల నిఘాతో మందుబాబులపై దృష్టి సారించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే 100 లేదా 112 లేదా సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని, జిల్లాలో పోలీసు తనిఖీలు పెద్ద ఎత్తున కొనసాగుతాయని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు.

మద్యం దుకాణాలకు నేడు లక్కీడిప్

కర్నూలు: గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం లక్కీడిప్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కలెక్టర్ రంజిత్‌బాషా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంటు సుధీర్‌బాబు తెలిపారు. ఇందుకోసం భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించేందుకు వీడియో, ఫొటో గ్రఫీ ద్వారా చిత్రీకరించనున్నారు. జిల్లాలో 7 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్‌ల పరిధిలో 10 మద్యం దుకాణాలను గీత కులాలకు రిజర్వు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు వారం రోజులుగా ఆయా స్టేషన్ల వారీగా అధికారులు ఏర్పాట్లు చేసి దరఖాస్తులు స్వీకరించారు. 10 దుకాణాలకు మొత్తం 133 దరఖాస్తులొచ్చాయి.

ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం

ఆలూరు: మండలంలోని మూసానపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సోమేశ్వరస్వామి గర్భాలయానికి మనేకుర్తి గ్రామానికి చెందిన పైనీర్ డెవలపర్స్ సంస్థ నిర్వాహకుడు, యువపారిశ్రామికవేత్త వై.హనుమంతరెడ్డి ఆదివారం రూ. 2 లక్షలు విరాళంగా అందించారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 200 మందికి అన్న ప్రసాదం అందించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నేడు కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని వెల్లడించారు.

రైతులకు 11 అంకెల భూమి గుర్తింపు కార్డులు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్రప్రభుత్వం దేశ వ్యాప్తంగా రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన ప్రత్యేక నెంబరును కేటాయిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు 11 అంకెల భూమి గుర్తింపు కార్డు ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు అందుతాయని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం/ 1బీ, ఆధార్‌కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరుతో సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను సంప్రదించి భూమి గుర్తింపు కార్డు పొందవచ్చని సూచించారు. ఈ ప్రక్రియను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా చేపడుతున్నాయని తెలిపారు. http://apfr.agrisrtack.gov.in పోర్టల్ ద్వారా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశలో భూమి యజమానులకు 11 అంకెల గుర్తింపు కార్డులు జారీ చేయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మురుగు కాల్వలు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

సీ‘ఛీ’ రోడ్లు

‘కూటమి’ పాలనలో గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదు. అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాలు, ఇతరత్రా వాటిని తొలగించకుండానే రోడ్లు వేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ‘ఉపాధి’ నిధులతో ఇటీవల సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఓ రోడ్డు మధ్యలో కరెంట్ స్తంభాలు కనిపిస్తున్నాయి. ఇలా నడిరోడ్డుపై స్తంభాలుంటే తాము ఎలా వెళ్లాలంటూ కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. మురుగునీరు వెళ్లేందుకు రోడ్డు పక్కన కాల్వలను కూడా నిర్మించలేదు. ఇష్టానుసారంగా వేస్తున్న రోడ్లతో ఎవ్వరికి లాభమంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. – కోడుమూరు రూరల్



కరెంట్ స్తంభాన్ని తొలగించకుండానే వెంకటగిరిలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు




ఓ కార్పొరేట్ కాలేజీలో ల్యాబ్

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్‌ఐఓ కార్యాలయం నుంచి సీసీ కెమెరాల పర్యవేక్షణ చేయనున్నారు. ఎంపీసీ గ్రూప్‌లో భౌతిక, రసాయనశాస్త్రం, బైపీసీ గ్రూప్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఉంటాయి. వీటిలో ఒక్కో ల్యాబ్ వేర్వేరుగా ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు కాలేజీల్లో తగిన గదులు ఉండాలి. అయితే గదుల కొరత కారణంగా ఒకే గదిలోనే కెమెరాలను ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రాక్టికల్స్‌లో అక్రమాలు ఎలా అడ్డుకుంటారో చూడాలి. గత ప్రభుత్వం ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలకు తావు లేకుండా జంబ్లింగ్ విధానాన్ని అమలు చేసింది. అయితే ఆయా కాలేజీల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడేందుకు నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించుకునేలా మార్పు చేయించుకున్నాయనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 161 జూనియర్ కాలేజీలు ఉండగా.. వీటిలో ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 60 కేంద్రాలు ఏర్పాటు చేశారు. బైపీసీ విద్యార్థులు 4,679, ఎంపీసీ విద్యార్థులు 10,515 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఒక్కో విద్యార్థికి ఫిజిక్స్‌కి రూ.2.50, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌కు రూ.7.50, బొటనీకి రూ.2.50, జువాలజీకి రూ.3, ఇతర ఆఫీస్ ఖర్చులకు రూ.2.50, వొకేషనల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.23.66 ప్రకారం నిధులు కేటాయించాల్సి ఉంది. పరీక్షలు నిర్వహించేందుకు మాత్రం కంటిన్‌జెంట్ ఫండ్స్ కింద ఇంత వరకు ఒక్క పైసా కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయలేదు. పరీక్షలను ఎలా నిర్వహించాలో అర్థం కాక ఆయా ప్రభుత్వ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు ఆందోళన చెందుతున్నారు.

నులిపురుగులను నలిపేద్దాం!

- నులిపురుగులతో అనారోగ్యం
- రక్తహీనత, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి తగ్గిపోవడం, పోషకాహారం లోపం వంటి సమస్యలు
- ఆల్బెండజోల్ మాత్రలతో నివారణ
- నేడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ



కర్నూలు(హాస్పిటల్): మన పూర్వీకులు ఎవ్వరైనా ఇంట్లోకి వస్తే కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కుని రావాలని చెప్పేవారు. నాడు వారు ఏ ఉద్దేశంతో అలా చెప్పారో తెలియదు కానీ శుభ్రత వల్ల కడుపులో నులిపురుగుల చేరిక బాధ తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఈ నులిపురుగుల నిర్మూలనకు ఈ నెల 10వ తేదీన జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టనున్నారు. ఇప్పటికే భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, శుభ్రమైన నీటిని తాగాలని అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,231 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 103 జూనియర్ కళాశాలలు, 18 చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి, 17 ఐటీఐలు, ఐదు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 5 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 6,42,391 మంది చదువుతున్నారు. వీరికి ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్ మాత్రలు) మింగించనున్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అరమాత్ర, ఆపై వయస్సున్న పిల్లలకు ఒక మాత్ర వేసేందుకు జిల్లాకు అవసరమైన మాత్రలు ఇప్పటికే తెచ్చి ఆయా విద్యాసంస్థలకు పంపించినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ ఆదివారం వెల్లడించారు.

నులిపురుగుల వ్యాప్తి ఇలా..

నులిపురుగులు ఉన్న వ్యక్తి మల విసర్జన ద్వారా గుడ్లు నేలలోకి, తద్వారా తాగునీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరతాయి.

నులిపురుగులతో పోషకాహార లోపం



పిల్లల కడుపులో నులిపురుగులు ఏర్పడటం వల్ల వారిలో పోషకాహార లోపం, రక్తహీనత వస్తాయి. ఈ కారణంగా పిల్లల్లో ఏకాగ్రత లోపం, చదువులో వెనుకబాటుతనం వంటి సమస్యలు దీర్ఘకాలికంగా వేధిస్తాయి. దీంతో పాటు బరువు తగ్గడం, వికారంతో పాటు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. కాబట్టి ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఏడాదికి రెండుసార్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు పాఠశాల,కళాశాల ఉపాధ్యాయులు,అధ్యాపకులు చొరవ చూపాలి. – శైలేష్‌కుమార్, రాష్ట్రీయ బాలస్వాస్థ్య ప్రోగ్రామ్ అధికారి,కర్నూలు

లక్షణాలు

పిల్లల కడుపులో నులిపురుగులు ఉంటే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఆకలి తగ్గిపోవడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు(రక్తవిరేచనాలు కూడా కావచ్చు), పోషకాహారలోపం, రక్తహీనత, తరచుగా ఇన్‌ఫెక్షన్లకు గురికావడం. దీని వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతుంది. చదువులో ఇతరుల కంటే వెనుకబడిపోతారు.

అహోబిలేశునికి జన నీరాజనం



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న ప్రధానార్చకులు

ఉయ్యాలవాడ: తన వివాహ మహోత్సవానికి భక్తులను ఆహ్వానించేందుకు పల్లకీలో బయలుదేరిన అహోబిలేశునికి ఆదివారం సర్వాయిపల్లె గ్రామస్తులతోపాటు ఇతర గ్రామాల భక్తులు నీరాజనం పలికారు. 25 రోజుల అనంతరం ఆదివారం స్వామి వార్లకు సర్వాయిపల్లెలో ఏకాంత అభిషేకాలు నిర్వహించారు. ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు కోనేటి నీటితో పుణ్యస్నానాలు, పాలు, తేనె, గంధం, నెయ్యి, పెరుగు, పండ్లతో తిరుమంజనం చేపట్టారు. తర్వాత నూతన వస్త్రాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

‘స్వర్ణరథం’పై ఆదిదంపతులు

- దేదీప్యమానంగా మల్లన్న స్వర్ణరథోత్సవం





స్వర్ణరథంపై ఆశీనులైన ఆదిదంపతులు, ఆలయ మాడవీధుల్లో భక్తజనం మధ్య స్వర్ణ రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను స్వర్ణ రథంపై ఊరేగించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు అర్చకులు జరిపించారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందుభాగం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు సాగిన ఈ కార్యక్రమంలో కోలాటం, చెక్కభజన తదితర జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, ఈఈ ఎం.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం నగర శివారులోని పెద్దపాడు వేదాన్షి పాఠశాలలో రాష్ట్ర స్థాయి యోగా ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి పాఠశాలలో యోగా సాధన తరగతులు త్వరలోనే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యోగా సంఘం రాష్ట్ర చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీల్లో ప్రతిభ చాటిన యోగా క్రీడాకారులు ఈనెల 13 నుంచి 16 వరకు కేరళలో జరిగే 49 వ జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.



క్లుప్తంగా

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నరప్‌గా ఏపీ



రన్నరప్‌గా నిలిచిన ఏపీ జట్టు సభ్యులతో జాతీయ క్రీడాకారులు

డోన్: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఈనెల 6 నుంచి నిర్వహిస్తున్న 70వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఏపీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో ఇండియన్ రైల్వేస్ జట్టు చేతిలో ఓటమి పాలుకావడంతో ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. కాగా ఏపీ జట్టు సభ్యులను ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కోచ్ కేతు మౌలా, జాతీయ క్రీడాకారులు రషీద్, ఆనంద్, రిజ్వాన్, ఇబ్రహీం, ఇంథియాజ్, గంగన్న, అనార్, రైల్వే నాగేంద్ర, రాజు, జట్టు మేనేజర్ రైల్వే ప్రకాష్ అభినందించారు.

ఆలయ హుండీలో చోరీ



చోరీకి గురైన హుండీ

కోసిగి: దొడ్డి గ్రామం నుంచి చిన్న భూంపల్లి గ్రామానికి వెళ్లే మార్గ మధ్యలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయం హుండీలో శనివారం రాత్రి గుర్తు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన పలువురు భక్తులు వెళ్లి చూస్తే హుండీని పగులకొట్టినట్లు కనిపించింది. అందులో ఉన్న నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజు నుంచి మరలా శ్రీరామ నవమి వరకు హుండీ లెక్కిస్తున్నారు. హుండీలో దాదాపు రూ. 20వేల వరకు నగదు ఉంటుందని భక్తులు చెప్పారు. గ్రామ శివారులో ఉండడంతో మూడో సారి దొంగతనం జరిగిందని తెలిపారు.

కృష్ణ జింక మృతి



మృతిచెందిన కృష్ణ జింక

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కృష్ణజింక ఆదివారం రాత్రి సమయంలో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారు ప్రాంతం నుంచి ఓ కృష్ణజింక పరుగెత్తుకొని వచ్చింది. జనావాసాలను చూసి బెదిరి ఊర్లోకి పరుగెత్తుకుంటూ వెళ్తున్న సమయంలో అదుపుతప్పి ఇంటి గోడలను తగిలి కిందపడింది. తిరిగి లేచి మళ్లీ పరుగెత్తే సమయంలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రహరీ గోడలకు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాతపడినట్లు గ్రామస్తులు తెలిపారు. రోళ్లపాడు అటవీ సిబ్బందికి సమాచారం చేరవేశామన్నారు.

ఆర్‌ఎఫ్‌పీ టెండర్లతో తీవ్ర అన్యాయం

కర్నూలు(సెంట్రల్): రిక్వెస్టు ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ) కొత్త టెండర్లతో 104 ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, పెద్దయ్య పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న విధానం ఉద్యోగులకు ఎంతో బాగుందని, అయితే కొత్తగా రూపొందించిన ఆర్‌ఎఫ్‌పీలో డీఈఓలకు జీతభత్యాల విషయంలో ఎలాంటి మార్పు జరుగలేదన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాల విషయంలో స్పష్టత లేదన్నారు. అంతిమంగా సీటీసీ పదాన్ని చేర్చడంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో కె.వెంకటేష్, కల్యాణి, చంద్రహాస్ పాల్గన్నారు.

సాగునీటి సం'క్షోభం'

- గాజులదిన్నె ప్రాజెక్టుకు అందని హంద్రీ–నీవా నీరు
- నవంబరులో తెరుచుకున్న స్లూయిజ్
- మూడు నెలలైనా 0.52 టీఎంసీల నీరు చేరని పరిస్థితి
- ఆయకట్టు రైతులకు క'న్నీటి' కష్టాలు
- పట్టించుకోని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు



ఈ నెల మొదటి వారంలో విత్తనం వేసిన పొలానికి నీరు పెడుతున్న దృశ్యం

కర్నూలు సిటీ: సాగునీటి రంగాన్ని బలోపేతం చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. టీడీపీ నేతల నిర్లక్ష్యం, ఇంజినీర్ల అలసత్వంతో రైతులకు క'న్నీటి' కష్టాలు మిగిలాయి. ప్రస్తుతం గాజులదిన్నె(దామోదరం సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు సాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ ప్రాజెక్టుకు హంద్రీ–నీవా కాలువ నుంచి నీటిని మళ్లిస్తామని 2014–19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. వైఎస్సార్‌సీపీ పాలనా కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. జీడీపీకి హంద్రీ–నీవా నుంచి 3.5 టీఎంసీల నీటిని కేటాయించారు. అలాగే హంద్రీ–నీవా కాలువ 110.4 కి.మీ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసేందుకు రూ.5.9 కోట్లు కేటాయించారు. పనులు పూర్తి నీటిని కూడా అందించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పట్టించుకోకపోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టు ఆయకట్టు కింద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది నవంబరు 24వ తేదీ వరకు స్లూయిజ్ ద్వారా జీడీపీకి చుక్క నీరు ఇవ్వలేదు. రోజుకు 230 క్యూసెక్కుల నీరు ఇవ్వాల్సి ఉండగా ఆ తర్వాత కేవలం 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టులోకి కేవలం 40 క్యూసెక్కుల నీరు వస్తోంది. డిసెంబరు 20వ తేదీ నుంచి నీటి విడుదలను పెంచినా కూడా ఇప్పటి వరకు 0.52 టీఎంసీ నీరు మాత్రమే వచ్చినట్లు ఇంజినీర్ల గణాంకాలు చెబుతున్నాయి.

ఆయకట్టు రైతుల ఆందోళన

శ్రీశైలం రిజర్వాయర్‌కు 2024–25 జల సంవత్సరంలో రికార్డు స్థాయిలో 1,500 టీఎంసీలకుపైగా వరద నీరు వచ్చి చేరింది. హంద్రీ–నీవా కాలువకు గతేడాది ఆగస్టు 1వ తేదీ నుంచి శ్రీశైలం రిజర్వాయర్ నీటిని మాల్యాల నుంచి పంపిస్తున్నారు. ఆ వెంటనే గాజులదిన్నె ప్రాజెక్టు ఇంజినీర్లు స్లూయిజ్ ద్వారా నీరు ఇవ్వాలని కోరినా హంద్రీ–నీవా ఇంజినీర్లు స్పందించలేదు. టీడీపీ నేతల దృష్టికి తీసుకపోయినా ప్రయోజనం లేకుండా పోయింది. గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోతుండడం...రబీ ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉండడంతో నవంబరు 24 నుంచి నీటిని విడుదల చేశారు. అయితే ఆశించిన స్థాయిలో నీరు ప్రాజెక్టులోకి చేరకపోవడంతో 26 వేల ఎకరాల ఆయకట్టులో సాగు ప్రశ్నార్థకంగా మారింది. 12,300 ఎకరాలకు మాత్రమే నీటిని పరిమితం చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీ–నీవా నుంచి నీటిని ఆగస్టులోనే విడుదల చేయించినట్లయితే మొత్తం ఆయకట్టుకు నీరు వచ్చేది. నీరు వస్తుందనే ఆశతో డిసెంబరులో రైతులు అరుతడి పంటలను సాగు చేశారు. మరికొందరు ఈ నెల మొదటి వారం వరకు పంటలను సాగు చేశారు. డిసెంబరు చివరిలో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికి రావాలంటే ఏప్రిల్ చివరి వరకు నీరు ఇవ్వాలి. లేదంటే పంటల దిగుబడి తగ్గిపోయి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. అయితే ఇంజినీర్లు మాత్రం సాగునీటి సలహా మండలి సమావేశంలో చెప్పిన విధంగా మార్చి చివరి వరకే నీరిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.1 టీఎంసీల నీరు ఉంది. ఇందులో తాగు నీటి అవసరాల కోసం 1.5 టీఎంసీలను వాడుకోవాల్సి ఉంది. మిగిలిన 0.6 టీఎంసీ నీటితో సాగులో ఉన్న పంటలకు నీరు ఇచ్చేనా అనే ప్రశ్నలు వస్తున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. ఈ నెలాఖరులోపు హంద్రీ–నీవా కాలువకు నీరు బంద్ అయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జీడీపీకి రావాల్సిన 3.5 టీఎంసీలు నీటి ఏ మేరకు తీసుకొచ్చి, ఎంత వరకు ఆయకట్టుకు నీరిస్తారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



హంద్రీనీవా నుంచి జీడీపీకి వస్తున్న నీరు

చెప్పిన వరకు మాత్రమే నీరిస్తాం

రబీ సాగునీటి సలహా మండలి సమావేశంలో చెప్పిన విధంగా మార్చి చివరి వరకు మాత్రమే నీరిస్తాం. హంద్రీనీవా నుంచి మొదట్లోనే స్లూయిజ్ ద్వారా జీడీపీకి నీటిని విడుదల చేయాలని హంద్రీనీవా ఇంజినీర్లకు లేఖలు రాశాం. అవసరం ఉందని నీరు ఇవ్వలేదు. ప్రస్తుతం స్లూయిజ్ నుంచి నీరు వస్తుంది. ఆలస్యంగా పంటలు సాగు చేయకూడదని రైతులకు సైతం తెలియజేశాం. తాగు, సాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొనే ఆయకట్టుకు నీరిస్తున్నాం. ఇప్పటికే మూడు తడులు ఇచ్చాం. మరో రెండు తడులు ఇస్తాం. సాధ్యమయితే మరో తడి ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం.

– విజయ్‌కుమార్, జీడీపీ , డీఈఈ

ఏప్రిల్ వరకు నీరు ఇవ్వాలి



గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో రబీ సీజన్ కింద ఎకరన్నర పొలంలో కొర్ర పంటను సాగు చేశాం. మార్చి చివరి వరకు మాత్రమే నీరిస్తే పంటలు నష్టపోతాం. సాగులో ఉన్న ఆయకట్టు గట్టెక్కాలంటే కచ్చితంగా ఏప్రిల్ వరకు నీరు ఇవ్వాలి. లేకపోతే పంట దిగుబడులు తగ్గి సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది.

– నాగ భూషణం రెడ్డి, కోడుమూరు, జీడీపీ ఆయకట్టు రైతు

భూగర్భ జలాల అభివృద్ధిపై అవగాహన కల్పించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీపీ

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు భూగర్భ జలాలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణమోహన్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు, భూగర్భ జలాల అభివృద్ధి తదితర వాటిపై ఏపీడీ వివరించారు. వర్షపు నీరు వృథాగా పారిపోకుండా.. ఆ నీటిని భూమిలోకి ఇంకింప చేయడం ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఇందుకోసం రైతులు ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... రైతులకు ప్రతి అవసరానికి మొదట గుర్తుకు వచ్చేది ఇన్‌పుట్ డీలర్లు మాత్రమేనని, వారికి భూగర్భ జలాలు పెంచుకోవాల్సిన అవసరంపై చక్కటి సలహాలు ఇవ్వాలని సూచించారు.

సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ ఎన్టీఆర్, గుంటూరు జట్లు



రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి కప్పు అందుకుంటున్న గుంటూరు బాలికల జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ఎన్టీఆర్ (బాలురు), గుంటూరు (బాలికల) జట్లు విజేతగా నిలిచాయి. స్థానిక కర్నూలు క్లబ్‌లోని టెన్నిస్ మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు ట్రోఫీలు, పతకాలు, బహుమతులు అందజేశారు. బాలుర వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో పి.వి. సింహాన్, సన్నీ, ధ్యానేశ్వర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల విభాగంలో వైశాలి, లిల్లీ గ్రేస్, సాహితీలు వరుసగా మొదటి, రెండో, మూడవ స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో ఎన్టీఆర్, గుంటూరు, కాకినాడ జట్లు, బాలికల విభాగంలో గుంటూరు, కాకినాడ, శ్రీకాకుళం జట్లు వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఏ సుభాన్

కర్నూలు(సెంట్రల్): కేరళ తరహాలో వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుభాన్, కమిటీ సభ్యులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్‌ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనార్టీలపై అభాండాలు వేస్తూ మోసపూరిత పాలన సాగిస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకే సవరణ చట్టం తెస్తోందన్నారు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఏపీలోని టీడీపీ, జనసేన పార్టీలు కూడా వ్యతిరేకించాలని, లేదంటే ప్రజలే ఆ పార్టీల నాయకులకు గుణపాఠం చెబుతారన్నారు.

శ్మశాన వాటిక విషయంలో మళ్లీ ఘర్షణ

మంత్రాలయం: చెట్నహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో ఆదివారం మళ్లీ ఘర్షణ చోటుచేసుకుంది. ఒక వ్యక్తి మృతి చెందగా శ్మశానంలో ఖననం చేసేందుకు కొందరు వెళ్లారు. వారితో మరో వర్గీయులు వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. శ్మశానంలో మృతదేహానికి అంత్యక్రియలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా గతంలో కూడా శ్మశాన విషయమై ఇరువర్గాలు మధ్య ఘర్షణ నెలకొనగా.. ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల



జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఏడోవ గేటు నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వకు 500 క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,500 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరుగంటల సమయానికి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 851అడుగుల నీటి మట్టం నమోదైంది.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లా జట్టు చాంపియన్



కర్నూలు (టౌన్): ఈనెల 7 నుంచి 9 వరకు అనంతపురం పట్టణంలోని పీటీసీ క్రీడా మైదానంలో నిర్వహించిన 43 వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు సత్తాచాటింది. 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల రిలే పరుగు, డిస్కస్ త్రో వంటి క్రీడాంశాల్లో జిల్లా జట్టుకు 32 బంగారు పతకాలు, 29 వెండి పతకాలు, 41 కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాండు రంగారెడ్డి, రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫుట్‌బాల్ విజేత బీక్యాంపు జట్టు



కర్నూలు (టౌన్): జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బి.క్యాంపు జట్టు విజేతగా నిలిచింది. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతగా నిలిచిన జట్టుకు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్ కప్పు అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు, సభ్యులు ముప్పా రాజశేఖర్, పాల్ విజయ్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'విరసం' రచనలతో సమాజ చైతన్యం




మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, హాజరైన విరసం సభ్యులు

- ప్రొఫెసర్ హరగోపాల్

కర్నూలు కల్చరల్: విప్లవ రచయితల సంఘం (విరసం) రచనలు సమాజ చైతన్యానికి తోడ్పడుతున్నాయని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కర్నూలు నగరంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న విరసం 24వ సాహిత్య పాఠశాల కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముఖ్య వక్తగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఫాసిజం దేశంలో నలుమూలల విస్తరించిందని, రాజ్య హింస అవధులు దాటుతోందన్నారు. భారతీయ సమాజంలో అంబేడ్కర్ తరువాత గొప్ప మేధస్సు కలిగిన వ్యక్తిగా వరవర రావు కనబడతాడన్నారు. సాహిత్యంలో ప్రధాన భూమిక పోషించి ఉంటే ఆయనకు జ్ఞాన పీఠ పురస్కారం వచ్చేదన్నారు. గ్రాంసీ తరువాత అంత గొప్ప మేధస్సు కలిగిన వ్యక్తి సాయిబాబా మాత్రమే అన్నారు. ఒక అమానవీయ భావజాలం ఏర్పడిందని, గొప్ప వ్యవస్థను నిర్మించలేక పోతున్నామన్నారు. కుంభమేళాలలో వేల మంది చనిపోతే దేనికి నిదర్శనమన్నారు. మేధావులు జ్ఞానాన్ని భాషగా మార్చాలన్నారు. ఇటీవల కాలంలో రచయితలు ప్రజలకు దగ్గరయ్యే సాహిత్యం సృష్టించడం ఆశాజనకంగా భావిస్తున్నామన్నారు. బహిరంగ సభకు నాగేశ్వరాచారి అధ్యక్షత వహించారు. ఈ సభల్లో దాదాపు 27 పుస్తకాలు ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు అన్న అంశంపై వరలక్ష్మి అధ్యక్షత వహించగా విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడారు. విప్లవోద్యమంపై ఫాసిస్ట్ యుద్ధం బుద్ధి జీవుల పాత్ర అనే అంశంపై సాగర్ అధ్యక్షత వహించగా పాణి మాట్లాడారు. విరసం నాయకులు రివేరా, శశికళ, అరుణ్, రత్నం ఏసేపు, కవులు రచయితలు మారుతి, ఎస్‌డీవీ అజీజ్, వెంకటేష్, ఏవీ రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఘంటసాల పాటల పండుగ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, కళాకారులు

కర్నూలు కల్చరల్: ఘంటసాల గాన కళా సమితి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం ఘంటసాల పాటల పండుగ ప్రారంభమైంది. ఘంటసాల ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య, ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు బీఎస్ రావు మాట్లాడుతూ తెలుగు వారు ఉన్నంత కాలం ఘంట సాల గానం చేసిన భగవద్గీత ఉంటుందన్నారు. అనంతరం గాయకులు హబీబ్, శ్రీనివాసులు, సుధారాణి, చంద్రకంటి మద్దయ్య ఘంటసాల పాడిన పాటలను పాడి అలరించారు. డాక్టర్ ఉమా నాథ్, డాక్టర్ నగేష్, ఘంటసాల గాన సభ అధ్యక్షుడు సుస్వరం వాసుదేవయ్య, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కేజీ గంగాధర్‌రెడ్డి, సత్య ప్రసాద్‌లు గాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం పధాన కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డోన్ కేంద్రంగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

డోన్: కూటమి నేతలు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు డోన్‌ను అడ్డాగా చేసుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుంకయ్య ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేవలం 9 నెలల వ్యవధిలోనే ఆ పార్టీ నాయకులు పేదల కడుపు కొట్టి రేషన్ బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు రవాణా చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేల అనుచరులు కూటమిగా ఏర్పడి డోన్‌ను కేంద్రంగా చేసుకొని రేషన్ బియ్యం దందాను కొనసాగిస్తున్నా విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమార్కులంతా కలిసి ప్రతిరోజు 3 నుంచి 4 లారీల రేషన్ బియ్యం డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి గుత్తి రోడ్డులో గోడౌన్‌ను డంప్ చేసి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి రెట్టింపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి మోటా రాముడు పాల్గొన్నారు.



'గుర్తు'కొస్తున్నాయి..

పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మావతి



పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేసిన గుర్తు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 1997నుంచి 2004 వరకు చదివిన పూర్వపు విద్యార్థులు అపూర్వ గుర్తును ఏర్పాటు చేశారు. 'ఐలవ్ జెఎన్‌వీ కర్నూలు' అని ఏర్పాటు చేసిన గుర్తును ఆదివారం ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూర్వపు విద్యార్థులు వివిధ పనుల్లో స్థిరపడి విద్యాలయాన్ని మరవకుండా అభివృద్ధికి కృషి చేస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. నవోదయలో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకున్నారని తెలిపారు. పూర్వపు విద్యార్థి రాజంపేట జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తాము చదువుకున్న విద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ప్రతి సంవత్సరం జరిగితే బాగుంటుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇ.పద్మావతికి శాలువాకప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హుసేన్‌బాషా, పూర్వపు విద్యార్థి సెక్రటరీ బసవరాజ్, కో–ఆర్డినేటర్ శివరాముడు, రమేష్‌సాగర్, 11వ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

వెల్దుర్తి: గుంటుపల్లె గ్రామంలో రాష్ట్రస్థాయిలో న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. గుంటి రంగాస్వామి తిరుణాలను పురస్కరించుకొని నిర్వహించిన ఈపోటీల్లో అనంతపురం జిల్లా అక్కంపల్లె ఇంద్రరెడ్డి వృషభాలు 2,550 అడుగుల దూరం బండలాగి విజేతగా నిలిచి రూ.40 వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా నంద్యాల కొత్తకోట కంభయ్య వృషభాలు, మల్లేల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ ఎడ్లు, డి రంగాపురం రామకృష్ణారెడ్డి ఎడ్లు, అనంతపురం సింగనగుంటపల్లె మోహన్‌కృష్ణ, రుద్రవరం ఎల్లగౌడ్ ఎడ్లు సంయుక్తంగా నిలిచి రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి. అలాగే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో సిద్ధినగట్టు నవీన్, రెండో స్థానంలో రామకృష్ణాపురం వినోద్ నిలిచి వరుసగా రూ.2,016, రూ.1,016 నగదు బహుమతి గెలుచుకున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలోని బుడ్డప్పనగర్‌లో ఓ వివాహిత మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలం ఎస్. కొట్టాలపల్లికి చెందిన శ్యామల (28)కు అనంతపురం నగరానికి చెందిన భాస్కర్‌తో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. కర్నూలు జిల్లా పత్తికొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న భాస్కర్... పత్తికొండలోనే ఉంటూ శని, ఆదివారాల్లో అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో బుడ్డప్ప నగర్‌లోని తన ఇంటిపై భాగాన ఉన్న రేకుల షెడ్డులో ఆదివారం శ్యామల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని గుర్తించిన భాస్కర్ వెంటనే శ్యామల కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఆమె ఆత్మహత్యకు మీరే కారణమంటూ ఫోన్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురానికి చేరుకుని కుమార్తె మృతదేహాన్ని పరిశీలించి, బోరున విలపించారు. కొన్నేళ్లుగా తమ కుమార్తెను అల్లుడు పుట్టింటికి పంపడం లేదని, దీంతో తరచూ తమకు ఫోన్ చేసి బాధపడుతూ ఉండేదని తెలిపారు. శ్యామల మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ మృతురాలి తల్లి రామలక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6665]

WANTED

■ Airtel కంపెనీ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: ఇంటర్ ఆపైన, జీతం: 15వేల నుండి 20 వేలకు పైన. సంప్ర: 91335 55004. [L-794737]

■ Wisdom అకాడమి నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సంప్ర: మెడికల్ కాలేజీ ఎదురుగా, కర్నూలు. ✆ 9177177289, 8919300841. [L-794734]

■ Wanted we have an Immediate Requirement for the position of Admission counsellors (F), Front Office Executive(F), BDEs (M&F) at International Delhi Public School, Kurnool. Qly: Any Degree with a professional attitude and good verbal communications. Walk-In: 10.02.25 (Monday) & 11.02.25 (Tuesday) from 10AMto1PM. Venue: International Delhi Public School, KJR City, NH-44, Chinnatekur, Kurnool. Cell: 9154770701, 9154770702. [L-794775]

■ Wanted any Degree holder to work in Field Investigation (FI) across AP & TS in a reputed audit firm. Interested persons (male only) send bio data mail kowthahr@gmail.com ✆ 70323 71423 / 99639 75952 [B-489]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పార్ట్ టైం పని చేస్తూ లక్షలు సంపాదించే అవకాశం. సంప్రదించండి: 7702805174. [SCA25001614]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph: 9160900024, 9640400073. [HA-1400]

■ కష్టలేక్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135. [HA-99792]

■ ఆదోని, చందన జ్యూయలరీ & షాపింగ్ మాల్‌లో పని చేసేందుకు స్టాఫ్ కావలెను. సేల్స్‌మెన్, ఫ్లోర్ సూపర్‌వైజర్స్, క్యాషియర్స్, బిల్ టెల్లర్స్, రిసీవింగ్ స్టాఫ్, IT ఎగ్జిక్యూటివ్, HR ఎగ్జిక్యూటివ్, డ్రైవర్స్, టైలర్, సెక్యూరిటీగార్డ్స్, హౌస్ కీపింగ్‌కు యువతీ, యువకులు కావలెను. జీతం+ PF+ ESI+ ఇన్సెంటివ్ + బోనస్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు బయోడేటాతో పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డుతో నేరుగా తే.13-2-2025, ఇంటర్‌నేషనల్ లాడ్జి,SKD రోడ్, ఆదోనికి ఉ॥ 10 గం నుంచి సా॥5గం॥లోగా హాజరు కాగలరు. సంప్రదించండి: 91002 98885, 70130 54455. [NA-2789]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

